

ఆదివరాహస్వామికి మొక్కులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని శ్రీఆదివ రాహస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. మొక్కులు చెల్లించుకున్నారు.



భక్తుల పుణ్య స్నానాలు

ధర్మపురి: ధర్మపురి గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆదివారం సెలవు దినం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/25.0

ఆకాశం మేఘావృతమవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న మురళీకృష్ణ

మంథని/కమాన్‌పూర్: జయశంకర్ భూపాలప ల్లి జిల్లా మహాదేవపూర్ మండలానికి వెళ్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు మంథని, కమాన్‌పూర్‌లో పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మంథని పెట్రోల్ బంక్ వద్ద జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, కాటారం సింగిల్ విండో చైర్మన్ చల్లా నారాయణరెడ్డితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు. కాగా హీమోఫిలియా వ్యాధిగ్రస్తులను దివ్యాంగుల జాబితాలో చేరుస్తూ వైకల్య ధ్రువపత్రాలు జారీ చేయాలని హీమోఫిలియా సొసైటీ చాప్టర్ జిల్లా అధ్యక్షుడు వొజ్జల మురళీకృష్ణ కాటారంలో కేంద్ర మంత్రికి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో వ్యాధిగ్రస్తుల కుటుంబాలు సుమారు 3 వేలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్రాలకు పంపినా.. వైకల్య ధ్రువపత్రాలు ఇవ్వడంతో అధికారులు జాప్యం చేస్తున్నారని మంత్రికి వివరించారు. నాయకులు జంగిపెల్లి అజయ్, మచ్చగిరి రాము, మట్ట శంకర్, మల్లారపు అరుణ్, బర్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి



ప్రశంసాపత్రాలు ఇస్తున్న డీజీఎం ప్రవీణ్ కే చౌదరి

జ్యోతినగర్(రామగుండం): విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర గణనీయమని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు డీజీఎం ప్రవీణ్ కే చౌదరి అన్నారు. ఆదివారం టెంపరరీ టౌన్‌షిప్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆన్‌ది స్పాట్ డ్రాయింగ్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరగతి గదుల్లో పాఠాలతో పాటు వారి మనోగతాల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు చిత్రలేఖన పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చంద్, సీనియర్ మేనేజర్ ఆదేశ్ కుమార్ పాండే, హెచ్‌ఎం ఆరంజ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న మహేశ్

రామగుండం: రజక సంక్షేమానికి, సమాజంలో తమకు గుర్తింపు కల్పించేందుకు రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి డి.శ్రీధర్‌బాబుకు అంతర్గాం మండలం పెద్దంపేటకు చెందిన కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ వినతిపత్రం అందజేశారు. కాగా తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పేరును యూనివర్సిటీకి పెట్టడంపై రజకుల తరఫున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రజక కార్పొరేషన్ ఏర్పాటుతో అణగారిన వర్గాలు మరింత అభ్యున్నతి సాధిస్తాయని మంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు మహేశ్ పేర్కొన్నారు.

జిల్లా కేంద్రంలో ట్రా'ఫికర్'



బారులుదీరిన వాహనాలు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలోని జెండాకూడలి ప్రాంతం మెయిన్‌రోడ్డులో ఇలా వాహనాలు బారులుతీరాయి. ఇరుకైన రోడ్డుపై ఎదురెదురుగా వాహనాలు రావడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడం మామూలైపోయింది. మాస్టర్‌ప్లాన్ అమలు చేసి ప్రధాన రోడ్లను విస్తరించి జిల్లా కేంద్ర హోదాకు తగ్గట్టుగా రహదారులను అభివృద్ధి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

లాభాల వాటాపై రగడ

- ఆందోళన బాటపట్టిన టీబీజీకేఎస్
- వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలంటున్న ఏఐటీయూసీ
- సంస్థకు వ్యతిరేకంగా సోషల్‌మీడియాలో ప్రచారం



సింగరేణి కార్మికులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి వాస్తవ లాభాలపై సంస్థలో లొల్లి మొదలైంది. ఈ అంశం కార్మికుల్లో చర్చనీయాంశంగా మారింది. కార్మికులను మోసం చేశారంటూ టీబీజీకేఎస్ నాలుగు రోజుల ఆందోళనకు పిలుపునిచ్చింది. ప్రభుత్వానికి, సంస్థకు వ్యతిరేకంగా సోషల్‌మీడియాలో పెద్ద మొత్తంలో ప్రచారం జరుగుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి వాస్తవ లాభాలు రూ.4,701కోట్లు సాధించినట్లు వెల్లడించింది. అందులో రూ.2,289 కోట్లు సంస్థ విస్తరణ, అభివృద్ధి పనులకు కేటాయించి మిగతా రూ.2,412కోట్లు నికరలాభాలుగా ప్రకటించారు. వీటిలో 33శాతం చొప్పున రూ.796కోట్లు కార్మికులకు ప్రకటించారు. అయితే వాస్తవ లాభాల మొత్తంపై 33శాతం కార్మికులకు ప్రకటించాలని టీబీజీకేఎస్, హెచ్‌ఎంఎస్ డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం, గుర్తింపు యూనియన్, యాజమాన్యం కలిసి కార్మికులను మోసం చేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఈసారి భారీగా పెరిగిన లాభాలు

గతేడాదితో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరంలో సంస్థ భారీగా లాభాలు సాధించినట్లు చెబుతున్నారు. టన్ను బొగ్గుపై రూ.300 ధర పెంచారని దీంతో సంస్థ సుమారుగా రూ.2వేల కోట్లకు పైగా లాభాలు ఆర్జించినట్లు కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. అదనంగా బొగ్గు తీయడం, బదిలీ వర్కర్లు 900మందికి పైగా రావడంతో జీతాల రూపంలో కూడా సంస్థకు ఆదా జరిగి లాభాలు పెరిగినట్లు చెబుతున్నారు. ఈక్రమంలో గతేడాది రూ.2,222 కోట్లు లాభాలు ఆర్జిస్తే, ఈసారి రూ.4,701కోట్లు లాభాలు వచ్చినట్లు పేర్కొంటున్నారు. గతంలో వార్షిక నివేదికలో చూపించిన ప్రకారంగా లాభాల వాటా ఇచ్చారని, ఈసారి వార్షిక లాభాల్లో చూపించిన మొత్తంలో ఎందుకు వాటా ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు.

గత రెండేళ్లలో లాభాలు రూ.కోట్లలో..

ఏడాది	లాభాలు	శాతం	పెట్టుబడికోసం	చెల్లింపు	వాటా
2022–23	2,222	32	–	2,222	711
2023–24	4,701	33	2,289	2,412	796
కార్మికులు	41,837 మంది				



కొత్త గనులు ప్రారంభించాలి



గుర్తింపు సంఘం ములాఖత్ అయ్యి చేస్తున్న డ్రామా ఇది. ఏఐటీయూసీ ఏమీ మాట్లాడటం లేదు. మిగిలిన డబ్బులతో కొత్తగనులు ప్రారంభించాలి. పర్మినెంట్ ఉద్యోగాలు పెరగాలి. దీనిపై గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల వైఖరి వెల్లడించాలి.

– రియాజ్‌అహ్మద్, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు

మోసాలను ఎండగడుతాం



లాభాల వాటా విషయంలో యాజమాన్యం, ప్రభుత్వం కార్మికులను మోసం చేశాయి. వాస్తవ లాభాలు అంటూ రూ.4,701కోట్లు చూపించి, అందులో రూ.2,412 కోట్ల లాభాల్లో 33శాతం వాటాగా చెల్లించడం అన్యాయం. దీనిపై కార్మికులను కలుపుకొని సంస్థ వ్యాప్తంగా దశలవారీగా ఆందోళనకు పిలుపునిచ్చాం. మోసాలను ఎండగడుతాం.

– మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు

నికరలాభం నుంచి చెల్లింపు



గతేడాది కూడా రూ.4వేల కోట్లకు పైగా లాభాలు వచ్చాయి. అయితే అప్పుడు నికర లాభం మాత్రమే ప్రకటించారు. గతంలో బ్యాక్‌ఫిల్లింగ్ పేరుతో లాభాల్లో కొంత మొత్తాన్ని పక్కనబెట్టిన సందర్భాలున్నాయి. గతేడాది లాభాలు రూ.2వేల కోట్లే వస్తే సీఎస్‌ఆర్ నిధుల కింద 2శాతం చొప్పున రూ.80కోట్లు ఏలా చెల్లించారు.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

అత్యధిక వాటా ఇప్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కింది

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్



గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికులకు గతంలో కన్న అత్యధిక లాభాల వాటా ఇప్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విడతల వారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో బీఆర్‌ఎస్ సింగరేణిని నిర్లక్ష్యం చేసి, గనులను మూసివేసే ప్రయత్నం చేసిందన్నారు. మూతపడిన మేడిపల్లి ఓసీపీలో జలవిద్యుత్ కేంద్రం, రామగుండంలో 800 మెగా పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో బీఆర్‌ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ కార్మిక నేతలు లంచాలు తీసుకొని ఉద్యోగాలు పెట్టించారని గతంలో తేటతెల్లమైందని, కొందరు జైలుకు వెళ్లిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. సింగరేణి నిధులను బీఆర్‌ఎస్ పార్టీ సంబంధం లేని ప్రాంతాల్లో ఖర్చు పెట్టి వృథా చేసిందన్నారు.

లాభాల వాటా చెల్లింపులో అన్యాయం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



గోదావరిఖని(రామగుండం): లాభాల వాటా చెల్లింపులో సింగరేణి కార్మికులకు అన్యాయం జరిగిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరినీ మోసం చేస్తూ వస్తున్న కాంగ్రెస్ సర్కార్ చివరకు సింగరేణి కార్మికుల చెమట కష్టాన్ని దోచుకుందన్నారు. 2023–24 సంవత్సరానికి సంస్థకు రూ.4,701 కోట్ల నికర లాభం వస్తే అందులో కేవలం రూ.796 కోట్లు కార్మికులకు ఇచ్చి 33 శాతం ఇచ్చామని అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. రూ.4,701 కోట్లలో 33శాతం వాటా చొప్పున రూ. 1,550 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈలెక్కన ప్రతీ కార్మికుడికి లాభాల వాటా కింద రూ.4లక్షలు రావాల్సి ఉందన్నారు. కానీ 2,412 కోట్లు ప్రకటించి అందులో లాభాల వాటాగా 33శాతం చొప్పున రూ.796కోట్లు ప్రకటించారన్నారు. దీంతో ప్రతీ కార్మికుడు ఆర్థికంగా నష్టపోయాడని, వచ్చిన మొత్తం లాభాల్లో 33శాతం వాటా పంచాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికుల పక్షాన నిలిచి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

కాంగ్రెస్ మోసంపై దశలవారీగా ఆందోళన

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికులకు లాభాల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం చేసిన మోసానికి వ్యతిరేకంగా దశల వారీ పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సంయుక్తంగా రూ.4,701 కోట్లు లాభాలుగా చూపించకుండా కేవలం రూ.2,412 కోట్లు (33 శాతం లాభాలు) ప్రకటించడం కార్మికులను మోసం చేయడమే అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 23న నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారని, 24న రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం, 25న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా, 26న కార్మికుల సంతకాలు సేకరించి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు పంపిస్తారన్నారు. కార్మికుల మనోభావాలను గుర్తించకుంటే హైదరాబాద్‌లోని సింగరేణిభవన్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, కేంద్ర నాయకులు చల్ల రవీందర్‌రెడ్డి, పింగళి సంపత్ రెడ్డి, ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్, నాయకులు ఉప్పులేటి తిరుపతి, మీస రాజు, భాస్కర్, సత్యనారాయణ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థ లాభాల్లో కాంట్రాక్టు కార్మికుల శ్రమ

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సాధించిన లాభాల్లో కాంట్రాక్టు కార్మికుల శ్రమకూడా ఉందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. ఆదివారం భాస్కర్‌రావు భవన్‌లో మాట్లాడారు. సింగరేణికి వచ్చిన లాభాల్లో కాంట్రాక్టు కార్మికుల శ్రమ కూడా ఉందని, వారికీ వాటా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంపై ఏఐటీయూసీ ఒత్తిడి తీసుకరావడం వల్లే రూ.5వేలు ఇచ్చేందుకు అంగీకరించారని పేర్కొన్నారు. నాడు పర్మినెంట్ కార్మికులకు ఈ హక్కు కల్పించినట్లుగానే ఇప్పుడు కాంట్రాక్టు కార్మికులకు కూడా మొదటిసారిగా వాటా ఇప్పించడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. లాభాల విషయంలో తమపై టీబీజీకేఎస్‌తో పాటు మరికొన్ని సంఘాలు దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. లాభాల వాటా ప్రకటనపై వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, గుడ్డిగా ఏఐటీయూసీని విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, ఎస్.వెంకట్‌రెడ్డి, బుర్ర తిరుపతి, ఎంఏగౌస్, ప్రకాశ్, ఇనుముల రాజమౌళి, పడాల కనకరాజు, చెప్యాల మహేందర్‌రావు, శివ, రాజనర్సు, తిరుపతి, ఊదరి రవి తదితరులు పాల్గొన్నారు.

అంతా ఆన్‌లైన్..
అయినా బ్రోకర్లదే హవా

- ఇటీవల పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద జనాన్ని చూసి విస్తుపోయిన కలెక్టర్
- రామగుండం కార్యాలయాన్ని తరలించాలని ఆదేశం



ఇటీవల పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: భూములు, ఇండ్ల క్రయ, విక్రయాలు.. మ్యారేజ్ సర్టిఫికెట్ లాంటి అవసరాల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారా.. అయినా బ్రోకర్‌ను సంప్రదించాల్సిందే.. అలా చేస్తేనే పని పూర్తవుతోంది. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చే వారికి ఆన్‌లైన్ నమోదుపై అవగాహన లేకపోవడం వల్లే బ్రోకర్ల సహకారం పొందుతున్నారని అధికారులు పేర్కొంటున్నా.. బ్రోకర్లే ఆమ్యామ్యాలు తీసుకునే పనులు పూర్తి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో పెద్దపల్లి, రామగుండం, సుల్తానాబాద్, మంథనిలో సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులున్నాయి.

ఈనెల 13న కలెక్టర్ తనిఖీ

పెద్దపల్లిలో ఉన్న పెద్దపల్లి, రామగుండం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఈనెల 13న కలెక్టర్ కోయ శ్రీహర్ష కార్యాలయ పనివేళలు ముగిసే సమయంలో ఆకస్మికంగా సందర్శించారు. ఆఫీసు సమయం ముగిసినా ఇంకా కార్యాలయం ఎదుట పెద్దసంఖ్యలో ప్రజలు ఉండడాన్ని చూసి విస్తుపోయారు. ఆఫీసు ముగిసినా ఇంత మంది ఎందుకున్నారని కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న డాక్యుమెంట్లను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఒకే భవనంలో రెండు కార్యాలయాలా?

పెద్దపల్లిలో ఒకే భవనంలో రెండు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండడం ఏంటని కలెక్టర్ ప్రశ్నించారు. ప్రభుత్వం కొత్తగా రామగుండం కార్యాలయాన్ని ఏర్పాటు చేసినా అక్కడ భవనం అందుబాటులో లేకపోవడంతో తాత్కాలికంగా ఇక్కడే నిర్వహిస్తున్నారని రామగుండం ఎస్‌ఆర్‌వో తిరుపతి తెలిపారు. రామగుండం ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం కార్యాలయాన్ని మంజూరు చేస్తే దాన్ని పెద్దపల్లిలో నిర్వహిస్తే ఫలితమేంటని అన్న కలెక్టర్ వీలైనంత త్వరగా రామగుండంకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్నితరలించేలాచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

స్టాంప్‌వెండర్ల ఇష్టారాజ్యం

జిల్లాలో స్టాంప్ వెండర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఎక్కువ ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల అమ్మకాల్లో అక్రమాలు ఉండొద్దని ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తెచ్చినా ఫలితం కనిపించడం లేదు. జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, రామగుండం, మంథని ప్రాంతాల్లో అక్కడక్కడ అసలు లైసెన్సుదారులు కాకుండా బినామీ వ్యక్తులే స్టాంపుపేపర్లు విక్రయిస్తున్నట్లు సమాచారం. లైసెన్సులో పేర్కొన్న చిరునామాలో కాకుండా తమకు తోచిన చోట ఇష్టానుసారంగా అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. పోస్టాఫీసుల్లో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అందిస్తామంటూ తపాల అధికారులు ప్రకటించినా అమలుకు నోచడంలేదు. స్టాంపు వెండర్ల అక్రమాలపై విచారణ జరపడంతో పాటు వీలైనంత త్వరగా పోస్టాఫీసుల్లో స్టాంపుపేపర్ల అమ్మకాలను అమల్లోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

వసతుల లేమిపై తల్లిదండ్రుల ఆగ్రహం



పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పేరెంట్స్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లోని జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో వసతుల లేమిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఇప్పటికే దాదాపు 600 మంది విద్యార్థులు ఉన్నా అదనంగా కరీంనగర్ జ్యోతిరావుపూలే గురుకులం నుంచి 350 మందిని ఇక్కడికి తరలించడంతో విద్యార్థుల సంఖ్య 950కి చేరింది. దీంతో వారికి సరిపడా సౌకర్యాలు లేక ఇబ్బందులపాలవుతున్నారు. స్నానాలకు గదుల కొరత, టాయిలెట్లు, భోజనానికి, పడుకునేందుకు, చదువుకునేందుకు ఇబ్బందులు తప్పడంలేదని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోయారు. పాఠశాలలో తరచూ విద్యుత్ సమస్య తలెత్తి చీకటిలో భయంతో గడపాల్సి వస్తోందని పేర్కొన్నారు. సమస్యలపై పాఠశాల సిబ్బందిని అడిగితే 'ఎవరికైనా చెప్పుకోండి.. లేకపోతే వెళ్లిపోండి' అని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా, ఆదివారం కావడంతో సెలవుపై వెళ్లినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

పోటీలకు తరలిన విద్యార్థులు



సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు తరలి వెళ్లారు. ఈనెల 21 నుంచి 23వ తేదీల్లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ గిరిజ, పీడీ జాహ్నవి, పీఈటీ అంజలి తెలిపారు.

ఇళ్లలోకి కాలువ నీళ్లు



సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్న బాధితురాలు

మంథని: మండలంలోని కన్నాలలో ఎస్సారెస్పీ ఎల్–6 కెనాల్ నీరు సమీపంలోని ఇళ్లకు చేరడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలువలో పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహం ముందుకు వెళ్లకుండా సమీపంలోని జంగిలి బుజ్జమ్మ, రాధమ్మ ఇళ్లలోకి చేరి ఇబ్బందులకు గురయ్యారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికతీత పనులు వెంటనే మొదలుపెట్టాలని బీజేపీ జిల్లా నాయకుడు చిదురాల మధూకర్‌రెడ్డి కోరారు.

గాడితప్పుతున్న హాస్టల్ నిర్వహణ

- అధికారులకు అదనపు బాధ్యతలు
- విధుల నిర్వహణకు ఆటంకాలు
- విద్యార్థులకు తప్పని తిప్పలు



తాళం వేసి ఉన్న గోదావరిఖని ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహం

గోదావరిఖనిటౌన్(రామగుండం): జిల్లాలోని బాలికల హాస్టళ్ల నిర్వహణ గాడితప్పుతోంది. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల(హెచ్‌డబ్ల్యూవో) కొరతతో ఉన్నవారికే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో వారు పనిభారంతో విధులు సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నారు. ఫలితంగా విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి తలెత్తుతోంది.

రామగుండంలో మూడు హాస్టళ్లు..

రామగుండం నియోజకవర్గంలో మూడు వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో రామగుండంలో ప్రీ మెట్రిక్ బాలికలు, గోదావరిఖనిలో ప్రభుత్వ బాలికలు, ప్రభుత్వ బాలుర కళాశాల వసతి గృహాలు ఉన్నాయి. ఈ మూడింటికి ముగ్గురు హెచ్‌డబ్ల్యూవోలు ఉండాలి. కానీ ఇద్దరితోనే నెట్టుకు వస్తున్నారు. గోదావరిఖని బాలికల కళాశాల హాస్టల్ హెచ్‌డబ్ల్యూవోకు మంథని బాలికల కళాశాల వసతి గృహం, పెద్దకల్వలలోని వసతి గృహం బాధ్యతలను అదనంగా అప్పగించారు. అలాగే గోదావరిఖని బాలుర కళాశాల వసతి గృహం హెచ్‌డబ్ల్యూవోకు రామగుండం ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహం, పెద్దపల్లి బాలికల కళాశాల వసతి గృహం–2కు అదనంగా బాధ్యతలు అప్పగించారు. తద్వారా వీరిపై అదనపు భారం పడుతోంది. విధులు సమర్థవంతంగా నిర్వర్తించే పరిస్థితి లేకుండా పోయింది.

కొరవడిన పర్యవేక్షణ

హాస్టల్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించిన ఉన్నతాధికారులు కనీసం వసతి గృహాల్లో వసతీసౌకర్యాలు, విద్యార్థుల తీరుతెన్నులను పర్యవేక్షించడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తద్వారా సౌకర్యాలు, వసతుల కొరతతో హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య క్రమంగా పడిపోతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. కొందరు హాస్టల్ సంక్షేమాధికారులు మూడ్రోజులకోసారి చుట్టపు చూపుగా వచ్చిపోతున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.

అధికారుల కొరత ఉంది

జిల్లాలో హెచ్‌డబ్ల్యూవోల కొరత ఉంది. ఉన్న వారిలో ఒక్కొక్కరికి మూడు హాస్టళ్ల బాధ్యతలు అప్పగించాం. వారు మూడుచోట్ల విధులు నిర్వర్తించాల్సి రావడంతో భారం పడుతోంది. ఇటీవల ప్రభుత్వం కొందరు హెచ్‌డబ్ల్యూవోలను ఎంపిక చేసింది. వారిలో కొందరిని జిల్లాకు కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుంది. ప్రస్తుతం విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.అనిల్‌ప్రకాశ్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


ఆంజనేయులు(ఫైల్)

చందుర్తి(వేములవాడ): తనపై దాడి చేయడాన్ని అవమానంగా భావించి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నర్సింగపూర్‌లో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాలు. నర్సింగపూర్‌కు చెందిన యువకుడు సూద్రం ఆంజనేయులు(22) అదే గ్రామానికి చెందిన వివాహితతో సన్నిహితంగా మెలుగుతున్నాడని ఆమె భర్త అనుమానించాడు. అంతేకాకుండా ఈనెల 15, 17 తేదీల్లో వివాహిత భర్తతోపాటు మరో ఐదుగురు ఆంజనేయులుపై దాడిచేశారు. ఈక్రమంలో ఆదివారం తెల్లవారుజామున తన ఇంట్లో ఆంజనేయులు ఉరివేసుకున్నాడు. తన కుమారుడి మృతికి ఆరుగురు కారణమంటూ మృతుని తల్లి రాజవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి ఏఎస్సై బాపు తెలిపారు.

ఆర్వీఎంకు మణెమ్మ పార్థివదేహం


ఆవాల మణెమ్మ(ఫైల్)

వీణవంక: మండలంలోని కొండపాక గ్రామ మాజీ ఎంపీటీసీ ఆవాల మణెమ్మ(88) అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె దేహాన్ని హైదరాబాద్‌లోని ఆర్వీఎం ఆసుపత్రికి అప్పగిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మణెమ్మ 2014 నుంచి 2018 వరకు కొండపాక– హిమ్మత్‌నగర్ గ్రామాలకు ఎంపీటీసీగా సేవలందించారు. మణెమ్మ మృతదేహాన్ని ఆసుపత్రులకు ప్రయోగాల కోసం ఇవ్వాలని తరచూ చెప్పేదని, అందుకే పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించినట్లు మణెమ్మ మనువడు హరిబాబు తెలిపారు. ఈ మేరకు కళాశాల వైద్యులు కొండపాకకు చేరుకొని వివరాలు నమోదు చేసుకొని పార్థివ దేహాన్ని తీసుకెళ్లారు.

గోదావరినదిలో వ్యక్తి మృతదేహం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరి బ్రిడ్జి సమీపంలో ఇటుకబట్టీల వద్ద ఆదివారం సాయంత్రం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గోదావరిఖని టూటౌన్ పోలీసుల వివరాలు.. గోదా వరినదిలో మృతదేహం తేలినట్లు సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతుడు మంచిర్యాల జిల్లాకు చెందిన సాటం వెంకటేశ్(32)గా గుర్తించారు. వెంకటేశ్ మంచిర్యాల టౌన్‌లో ఇంటర్నెట్ షాప్ నడుపుతాడు. ఓ హత్య కేసులో జైలుకు వెళ్లి వారం రోజుల క్రితం కండిషన్ బెయిల్‌పై వచ్చాడు. కాగా వెంకటేశ్ ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా హత్య చేసి ఉంటారా.? అనేది తేలాల్సి ఉంది. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, మృతుడి బంధువుల్లో ఒకరు మృతదేహాన్ని చూసి వెంకటేశ్‌గా గుర్తించారని పోలీసులు పేర్కొన్నారు.

వి'పత్తి'.. విపణిపైనే ఆశ

- ఎడతెరిపి లేని వర్షాలతో ఎదుగుదల లేని పత్తి
- మునురుకుంటున్న తెగుళ్లు
- తగ్గనున్న దిగుబడి.. మద్దతు ధరే దారి
- సీసీఐపైనే అన్నదాతల ఆశలు
- కొనుగోళ్ల ప్రక్రియ కోసం సన్నాహాలు


అమ్మకానికి వచ్చిన పత్తి

కరీంనగర్ అర్బన్: పత్తి ఈ సారి అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లుతోంది. ఆరంభంలో ఊరించిన పంట అకాల వర్షాలు, ఎడతెరిపిలేని వర్షాలతో ఆందోళన నెలకొంది. ఆగస్టు మొదటివారం వరకు పత్తి పంట ఆశలు నింపింది. వరుసగా వర్షాలు కురియగా చేలలో 20రోజులకు పైగా అడుగు పెట్టలేని పరిస్థితి. దీనికితోడు పచ్చ పురుగు, తెల్లదోమ ముప్పిరిగొనగా నివారణకు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో పంట దిగుబడి గణనీయంగా తగ్గనుండగా గిట్టుబాటు ధర కల్పించడమే అధికారుల ముందున్న మార్గం. వచ్చే నెలలో పత్తి కొనుగోళ్లకు యంత్రాంగం సన్నాహాలు చేస్తుండగా కలెక్టర్ పటిష్టమైన చర్యలు చేపట్టడం అత్యవసరం.

తగ్గుతున్న విస్తీర్ణం

జిల్లాలో వరి, పత్తి ప్రధాన పంటలు కాగా పత్తి సాగు గణనీయంగా తగ్గుతోంది. వరి 2.70లక్షల ఎకరాల్లో సాగైతే పత్తి కేవలం 43వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది. అయిదేళ్ల క్రితం 1.10లక్షల ఎకరాల్లో సాగవగా ఈ సారి సగానికి పైగా తగ్గింది. చొప్పదండి, రామడుగు, గంగాధర, గన్నేరువరం, ఇల్లందకుంట, చిగురుమామిడి, వీణవంక, సైదాపూర్ తదితర పత్తి పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యేది. కానీ వర్షాలు సమృద్ధిగా కురియడంతో వరి సాగుకే మొగ్గు చూపారు.

జిన్నింగ్ మిల్లులేనా అడ్డాలు

వ్యవసాయ మార్కెట్లలో పంట ఉత్పత్తులను విక్రయించే రైతులకు గత మూడేళ్లుగా భిన్న పరిస్థితి నెలకొంది. పత్తి పంటను కేవలం జిన్నింగ్ మిల్లుల్లోనే కొనుగోలు చేస్తున్నారు. ఇదేంటంటే మార్కెట్ యార్డుకు రైతులు విడిపత్తి తేవడం లేదని, అటే తీసుకెళుతున్నారని మిల్లుల నిర్వాహకులకే వత్తాసు పలుకుతున్నారని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ మార్కెట్లలోనే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తేనే రైతులకు మేలు చేకూరనుండగా అధికారుల లోపాయికారి ఒప్పందంతో మిల్లులకే పంపించే ఏర్పాటు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తీరా మిల్లుకు వెళ్లాకా పత్తి నాణ్యతగా లేదని సీసీఐ నిరాకరించి వ్యాపారులే కొనుగోలు చేసేలా పరోక్షంగా సహకరిస్తున్నారు. జిన్నింగ్ మిల్లుల్లో కాకుండా మార్కెట్ యార్డుల్లోనే సీసీఐ కొనుగోలు చేసేలా చూడాలని వారు కోరుతున్నారు.

జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణం: 3.34,606ఎకరాలు
పత్తి సాగు విస్తీర్ణం: 43878ఎకరాలు
దిగుబడి అంచనా: 3.07లక్షల క్వింటాళ్లు
పత్తి మద్దతు ధర (క్వింటాలుకు): మధ్యరకం: రూ.7121
పొడవాటి రకం: రూ.7521

సన్నాహాలు మొదలు

పత్తి కొనుగోళ్లకు సీసీఐ యంత్రాంగం సన్నాహాలు మొదలెట్టింది. ఈ సారి సీసీఐ ఆధ్వర్యంలో 19 కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. కరీంనగర్, జమ్మికుంట, గంగాధర, గోపాల్‌రావుపేట వ్యవసాయ మార్కెట్లతో పాటు 15 జిన్నింగ్ మిల్లుల్లో జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు చేయనున్నట్లు సమాచారం. ఇందుకోసం సీసీఐ జిన్నింగ్ మిల్లులను అద్దెకు తీసుకునే టెండర్ల ప్రక్రియను మొదలుపెట్టింది. ఈ నెల 25లోగా టెండర్ల ప్రక్రియ పూర్తవనుండగా తదుపరి గైడ్‌లైన్స్ విడుదల చేయనుంది.

సిబ్బందితోనే అసలు సమస్య

భారత పత్తి సంస్థ(సీసీఐ) రైతులకు కాకుండా వ్యాపారులకే మద్దతుగా నిలుస్తుందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏటా సిబ్బంది కొరత పేరుతో జిన్నింగ్ మిల్లులకే సహకరిస్తుంది. సగటు మూడు కేంద్రాలకు ఒక అధికారిని నియమించడంతో ఏ కేంద్రంలో ఎప్పుడుంటారో తెలియని అయోమయ పరిస్థితి. ప్రతీ కేంద్రానికి ఒక అధికారి చొప్పున నియమించాలి. తాత్కాలిక నియామకాలు కాకుండా రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలి. కొనుగోలు చేశాకా 48గంటల్లో అన్నదాత ఖాతాలో డబ్బులు జమయ్యేలా చూడటంతో పాటు హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లోనూ సీసీఐ ద్వారా కొనుగోళ్లు చేయాలి, అలాగే గతంలో కొన్ని జిన్నింగ్ మిల్లుల్లో తూకంలో తేడా వచ్చి అన్నదాతలు మోసపోయిన సందర్భాలున్నాయి. ప్రైవేట్ వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల్లో రైతులు పత్తిని విక్రయించాక వెంటనే డబ్బులు ఇవ్వడానికి వ్యాపారులు కొంత మొత్తం మినహాయించుకుంటున్నారు. ఇది నిబంధనలకు పూర్తి విరుద్ధం. దీనికి అడ్డుకట్ట వేయాలి.

మనీల్యాండరింగ్‌లో ఇరుక్కున్నావ్..

- ముంబయి పోలీసుల పేరుతో బెదిరింపులు
- రూ.1.43కోట్ల భారీ సైబర్ మోసం
- ట్రాన్స్‌ఫర్ చేసిన డబ్బులు మాయం
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

గోదావరిఖని(రామగుండం): 'మనీల్యాండరింగ్ కేసులో ఇరుక్కున్నావ్.. ఈ కేసు నుంచి బయటపడాలంటే నేను చెప్పిన అకౌంట్‌కు డబ్బు పంపించాలి' అంటూ సైబర్ నేరగాళ్లు మోసానికి పాల్పడ్డారు. ముంబయి పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామంటూ బెదిరింపులకు దిగడంతో బాధితుడు రూ.1.43 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేసి మోసపోయాడు. సైబర్‌క్రైం ఏసీపీ వెంకటరమణ తెలిపిన వివరాలు.. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఓ స్కూల్ నిర్వాహకుడు సైబర్ నేరగాళ్ల వలలో పడి భారీగా మోసపోయాడు. ఈ ఏడాది జూలై 22న సైబర్ నేరగాళ్లు స్కూల్ నిర్వాహకుడికి ఫోన్ చేసి ×మనీలాండరింగ్‌లో ఇరుక్కున్నావు, కేసు నుంచి బయట పడాలంటే నేను చెప్పిన అకౌంట్‌కు డబ్బు పంపించాలి. తాము మీ డబ్బును చెక్ చేసిన తర్వాత మీ అకౌంట్‌కి తిరిగి పంపిస్తాం₹ అని నమ్మబలికారు. ముంబయి పోలీసులం మాట్లాడుతున్నామని, చెప్పినట్లు చేయకుంటే త్వరగా జైలుకి వెళ్తావని బెదిరించడంతో నమ్మిన బాధితుడు భయంతో విడతలవారీగా రూ.1,43,75,000 ట్రాన్స్‌ఫర్ చేశాడు. తర్వాత మోసపోయినట్లు తెలుసుకుని ఈనెల 3న సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు మహారాష్ట్రలోని వాసిం జిల్లా దేవుపేట్‌వాసి సంతోష్‌శ్రీకృష్ణ నాగల్కర్‌ను పట్టుకొని విచారించారు. ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని బ్యాంక్ అకౌంట్ లావాదేవీలు పరిశీలించగా, కమీషన్ కింద అకౌంట్‌ను సైబర్ నేరగాళ్లకు అమ్ముకున్నాడని, అతడి బ్యాంక్ అకౌంట్‌లను సైబర్ నేరాలకు ఉపయోగించేవారని, ఇదివరకు సదరు అకౌంట్‌ను 18 నేరాల్లో ఉపయోగించినట్లు ఏసీపీ వెల్లడించారు.

లింకులు ఓపెన్ చేయొద్దు

రుణమాఫీ పేరుతో ఏపీకే ఫైల్ ద్వారా సోషల్ మీడియాలో లింక్‌లు వస్తున్నాయి. వీటిని ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు. సైబర్ నేరగాళ్లు పోలీస్‌వాళ్లం మాట్లాడుతున్నామని ఫోన్ చేసి భయభ్రాంతులకు గురిచేసి పెద్ద మొత్తంలో డబ్బు కాజేస్తున్నారు. సైబర్‌నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్రంలో దాదాపు 41శాతం నేరాలు ఇవే జరుగుతున్నాయి. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలి లేదా సైబర్‌క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి.

– వెంకటరమణ, సైబర్‌క్రైం ఏసీపీ

నాటుబాంబుల తయారీ ముఠా అరెస్ట్


కోనరావుపేటలో నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నాటుబాంబులు

- నలుగురి రిమాండ్
- 67 నాటుబాంబులు స్వాధీనం

కోనరావుపేట(వేములవాడ): నాటుబాంబులు తయారు చేస్తూ వాటి ద్వారా వన్యప్రాణులను వేటాడి మాంసం విక్రయిస్తున్న వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం ధర్మారంలో నాటుబాంబు పేలి గేదె మృతిచెందగా, యజమాని ముడికె మల్లేశం ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. గతంలో నాటుబాంబులు తయారు చేసిన పిట్టల రాజలింగంపై నిఘా పెట్టారు. ఆదివారం రాజలింగం నాటుబాంబులు విక్రయిస్తున్నాడన్న సమాచారంతో ఏఎస్సై రఘుపతిరెడ్డి తన సిబ్బందితో దాడి చేశాడు. బోనాలకు చెందిన పడిగె లస్మయ్యకు బాంబులు విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వారి వద్ద 27 నాటుబాంబులు, గన్‌పౌడర్, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. రాజలింగంను విచారించగా వీరిద్దరితోపాటు సర్దాపూర్‌కు చెందిన అంజయ్యకు విక్రయించినట్లు తెలిపాడు. వీరితోపాటు సర్దాపూర్‌లోని మొగిలి అంజయ్య ఇంటిపై దాడి చేయగా 20 నాటుబాంబులు లభించాయి. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ వేటగాళ్లను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్సైలు అశోక్, కిరణ్, ఏఎస్సై రఘుపతిరెడ్డి, కానిస్టేబుళ్లు విశాల్‌రాజు, రవి, సతీశ్, అభిషేక్, ఓదెలును సీఐ అభినందించారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న డాక్టర్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): విద్యార్థులు బాల్యం నుంచే ఓ లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవడంతో పాటు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని టీవీ సీరియల్ నటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణులు కె.వీ.ప్రదీప్‌కుమార్ అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ ప్రాంగణంలో ఆదివారం అల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతదేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర' అనే సదస్సుకు ముఖ్య అతిథి గా హాజరయ్యారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎందరో మహానుభావులకు పుట్టినిల్లు భారత్ అని, భారతదేశ అభివృద్ధిలో మనమంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యావేత్త డా.బి.మధుసూదన్ రెడ్డి, ఈసీజీ ఫౌండర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవ 2024 పోస్టర్ ఆవిష్కరణ

హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ–2024 వాల్ పోస్టర్, కరపత్రాలను ఆదివారం కొత్తపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి ఆవిష్కరించారు. సంస్థ సభ్యులు కుంటాల శ్రీనివాస్, జిల్లా రమణ, చాడ మధుసూదన్ రెడ్డి, పి.శ్రీనివాస్ శర్మ, ఈ.నగేష్, మనోజ్ పాల్గొన్నారు.

జోష్ నింపిన స్పార్కిల్– 2024

జగిత్యాల: విద్యార్థులు అధ్యాపకులు బోధించే విషయాలను ఏకాగ్రతతో విని, వాటిని విశ్లేషించుకోవాలని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జగిత్యాల స్థానిక ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఫెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి.

అంబులెన్సుకు ప్రమాదం


ప్రమాదానికి గురైన అంబులెన్సు వద్ద జనం

పెద్దపల్లిరూరల్: ప్రమాదాలకు గురైన వారిని ఆసుపత్రులకు తీసుకెళ్లే అంబులెన్స్ ఆదివారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద బోల్తాపడింది. పట్టణంలోని శాంతినగర్ నుంచి వస్తున్న అంబులెన్సును బొలెరో వాహనం ఢీకొట్టడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ ధోని చేతికి గాయమైంది. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం


మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని రాజీవ్‌చౌక్ వద్ద ఉన్న న్యూ పీకాక్ రెస్టారెంట్‌లో ఆదివారం ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. రెస్టారెంట్‌లోని కిచెన్‌లో ఏర్పాటు చేసిన చిమ్ని వద్ద పెద్దఎత్తున పొగలు రావడంతో రెస్టారెంట్ మొత్తం పొగతో నిండిపోయింది. సిబ్బంది అప్రమత్తమై ఫైర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారుగా రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు డివిజన్ ఫైర్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీగా బరిలో ఉంటా


మాట్లాడుతున్న కదారి అనంతరెడ్డి

- మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి

కరీంనగర్: టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించి ఆశీర్వదిస్తే శాసన మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యారంగ సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇస్తానని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఓ హోటల్‌లో తెలంగాణ ప్రభుత్వ ఆమోదిత పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా), జూనియర్, డిగ్రీ కళాశాలల అసోసియేషన్, ఇతర సంఘాల నేతలతో కలిసి మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న శాసనమండలి ఎన్నికల్లో టీచర్ ఎమ్మెల్సీగా తాను బరిలో ఉంటానని, బీజేపీ మద్దతు కోసం రాష్ట్ర నాయకులను కలిసి విన్నవించానని, అవకాశం ఇస్తే బీజేపీ మద్దతుతో లేనట్లయితే విద్యాసంస్థల అండదండలతో స్వతంత్రంగా పోటీ చేయడం ఖాయమని వెల్లడించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైతే నాణ్య మైన, విలువలతో కూడిన విద్య కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.అనిల్‌కుమార్, జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, ఏ.రామచంద్రారెడ్డి, బి. మధుసూదన్‌రెడ్డి, ప్రకాశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

జాయింట్ వెంచర్‌లో రామగుండం పవర్‌ప్లాంట్

- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

గోదావరిఖని(రామగుండం): సింగరేణి–టీజీ జెన్‌కో జాయింట్ వెంచర్‌లో రామగుండంలో 800మెగావాట్ల పవర్ ప్లాంట్ నెలకొల్పేందుకు ఉత్తర్వులు జారీ అయినట్లు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆదివారం తెలిపారు. రామగుండం 62.5 బి థర్మల్‌పవర్ స్టేషన్ స్థానంలో జాయింట్ వెంచర్ ద్వారా సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్‌ప్లాంట్ నెలకొల్పాలని, దీనికి సంబంధించి డిటేల్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) రూపొందించాలని సూచించారు. రామగుండం ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి ఇచ్చిన వినతి మేరకు ప్రభుత్వ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. వచ్చే వారంలోగా జాయింట్ వెంచర్ ప్రాజెక్టు రిపోర్టు రూపొందించాలని, వచ్చే నెలలోగా ప్రిఫేర్ ప్రాజెక్టు రిపోర్టు ఇవ్వాలని జెన్‌కోకు సూచించారు. సింగరేణి సంస్థ, టీజీ జెన్‌కోతో కోఆర్డినేట్ చేసుకోవాలన్నారు.

సమస్యలపై ప్రశ్నించడమే లక్ష్యం

- పి. సుగుణాకర్‌రావు


మాట్లాడుతున్న పి.సుగుణాకర్‌రావు

కరీంనగర్‌టౌన్: ప్రజల సమస్యలపై ప్రశ్నించడమే లక్ష్యంగా గత మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్నానని బీజేపీ సీనియర్ నాయకులు పొల్సాని సుగుణాకర్‌రావు అన్నారు. ఆదివారం చైతన్యపురిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఉమ్మడి మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ తరఫున తాను బరిలో ఉంటున్నట్లు తెలిపారు. కార్యకర్తలకు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తున్నానని వెల్లడించారు. బీజేపీ సీనియర్ నాయకులు దుర్గ మారుతి, గంప జగన్, ఎలగందల్ నందకుమార్, తాదూరి బ్రహ్మం, జెడి భగవాన్, కనక చంద్రం, మొలుగూరి కిషోర్, కొత్త శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు అందజేత


రమేశ్‌కు నగదు కవర్ అందిస్తున్న డిపో మేనేజర్

మంథని: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న డబ్బును ప్రయాణికుడి అందించిన ఆర్టీసీ ఉద్యోగులను పలువురు ప్రశంసిస్తున్నారు. వివరాలు.. గోదావరిఖని నుంచి భూపాలపల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో కాటారం సమీపంలో రమేశ్ అనే వ్యక్తి ఎక్కాడు. భూపాలపల్లిలో దిగి హనుమకొండ వెళ్లేందుకు మరో బస్సులో ఎక్కాడు. అయితే తన వెంట తీసుకొచ్చిన రూ.2లక్షల బ్యాగు కనిపించకపోడవంతో హైరానా చెంది భూపాలపల్లి సెక్యూరిటీ సిబ్బందికి విషయం తెలియజేశాడు. బస్సు తిరిగి గోదావరిఖనికి బయలుదేరింది. ఈ క్రమంలో సదరు బస్సు వివరాలు తెలుసుకోగా తిరుపతమ్మ కండక్టర్, డ్రైవర్ మొగిలిగా గుర్తించి బస్సు మంథని మీదుగా వెళ్తోందని ఇక్కడి డిపో మేనేజర్‌కు సమాచారం ఇచ్చారు. డీఎం శ్రావణ్‌కుమార్ బస్సు సీటులో ఉన్న డబ్బుల కవర్‌ను స్వాధీనం చేసుకొని రమేశ్‌కు అందించారు. బస్సు కండక్టర్, డ్రైవర్, భూపాలపల్లి సెక్యూరిటీ సిబ్బందిని అభినందించారు.

'జల్సా' జోష్

కొత్తపల్లి: కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత విద్యాసంస్థల ఉపాధ్యాయులకు జల్సా పేరిట నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు జోష్‌ను నింపాయి. ఆట, పాటలు, నాటికలు, ఉపన్యాసాలు, నృత్యాలతో సుమారు 650 ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఆకట్టుకున్నారు. కరీంనగర్ సూర్యనగర్‌లోని శుభం గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన ఈ జల్సా కార్యక్రమాన్ని పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చైర్మన్ దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, రాకేశ్, ప్రసాద్, రమణ, వినోద్ రావు, హన్మంతరావు, హెచ్‌ఎంలు బాలాజీ, ప్రశాంత్, శ్రీకర్, కవితాప్రసాద్, శర్మిష్ఠ, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న ఉపాధ్యాయినులు

దొంగిలించిన ఆభరణాలు విక్రయిస్తుండగా చిక్కిన దొంగ?


చోరీ జరిగిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం

రామగుండం: రామగుండం విద్యుత్‌నగర్‌కాలనీలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం పట్టపగలు తాళం పగులగొట్టి ఉత్సవ మూర్తుల ఆభరణాలను దొంగిలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 48 గంటలు తిరగక ముందే ఓ వ్యక్తి ఆభరణాలను ఆదివారం గోదావరిఖనిలోని ఓ స్వర్ణకారుడికి విక్రయించే క్రమంలో సినీఫక్కీలో చిక్కిన విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. విశ్వసనీయ సమాచారం మేరకు. ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడగా కొన్ని ఆభరణాలను ఒక వ్యక్తి మంచిర్యాలలో విక్రయించేందుకు వెళ్లాడు. మరో వ్యక్తి కొన్ని ఆభరణాలను గోదావరిఖనిలోని ఓ స్వర్ణకారుడి వద్ద విక్రయించేందుకు రాగా.. అక్కడే ఉన్న మరో స్వర్ణకారుడు వాటిని చూశాడు. కాగా, గతంలో ఇలాంటి ఆభరణాలు రామగుండంలోని తమ సోదరుడు చేసిన విషయం గుర్తొచ్చి వెంటనే తమ సోదరుడికి ఫోన్ చేయగా, ఆలయంలో ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిపాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన స్వర్ణకారుడు ఆలయ పూజారి, కమిటీ ప్రతినిధులకు సమాచారం అందించి వారు వచ్చేవరకు ఆభరణాలు విక్రయించేందుకు వచ్చిన వ్యక్తిని మాటల్లోకి దింపారు. ఆలయ పూజారి ఏటూరి శ్రావణ్‌కుమార్, కమిటీ ప్రతినిధులు స్వర్ణకారుడి వద్దకు చేరుకొని పరిశీలించగా చోరీకి గురైన ఆభరణాలుగా గుర్తించి సదరు వ్యక్తిని ప్రశ్నించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. మరో వ్యక్తి ఆభరణాలను మంచిర్యాలలో విక్రయించేందుకు వెళ్లగా అతడి వద్దే విలువైన ఆభరణాలున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ఈ మేరకు సదరు వ్యక్తిని రామగుండం పోలీసులకు అప్పగించారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు

- అరకిలో గంజాయి పట్టివేత
- మూడు సెల్‌ఫోన్లు, రెండు బైకులు స్వాధీనం

పెగడపల్లి: గంజాయి సేవిస్తూ ముగ్గురు వ్యక్తులు ఆదివారం పెగడపల్లి పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 500గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రవికిరణ్ కథనం ప్రకారం.. మండలంలోని నామాపూర్ శివారులో ముగ్గురు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లు పక్కా సమాచారం అందింది. వెంటనే సిబ్బందితో దాడిచేయగా.. ధర్మపురి మండలం తిమ్మాపూర్‌కు చెందిన తోడేటి వెంకటేశ్, బుగ్గారం మండలం సిరికొండకు చెందిన లింగాల వంశీ, చొప్పదండి మండలం భూపాలపట్నంకు చెందిన గుండేటి ప్రవీణ్ గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. వీరి వద్దనున్న బ్యాగులో 500 గ్రాముల గంజాయి లభించింది. గంజాయితోపాటు మూడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ప్రేమించాడు.. పెళ్లి అన్నాడు.. ఆపై తిరస్కరించాడు..?

- యువతి ప్రేమ ఖరీదు రూ.9లక్షలుగా వెల కట్టిన పెద్ద మనుషులు

జ్యోతినగర్(రామగుండం): యువతీ, యువకుడు మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటామని బాసలు చేసుకున్నారు. అంతలోనే మనస్పర్థలు రావడంతో వారి ప్రేమకు పెద్ద మనుషులు వెలకట్టిన ఉదంతం ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఎన్టీపీసీ రామగుండం పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే ఓ యువతి, యువకుడు కులాలు వేరైనప్పటికీ మనసులు కలిసి ప్రేమించుకున్నారు. మూడేళ్లుగా తమ ప్రేమను పంచుకుని పెళ్లి చేసుకుందామని ఓ నిర్ణయానికి వచ్చారు. ఇంతలోనే వారి మధ్యలో కొంత మనస్పర్థలు రావడంతో యువతిని పెళ్లి చేసుకునేందుకు యువకుడు నిరాకరించాడు. దీంతో బాధితురాలు యువకుడి ఇంటి ఎదుట నిరసన సైతం చేపట్టింది. ఇరువురి విషయం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. ఇంతలోనే ఏమైందో తెలియదు కానీ వారిద్దరి పెళ్లి జరుగకపోగా వారి ప్రేమను విడగొట్టడానికి కొంత మంది పెద్దలు రూ.9 లక్షలుగా నిర్ధారించినట్లు తెలిసింది. ప్రేమకు వెలకట్టిన క్రమంలో రూ.4లక్షలు సైతం యువతి బంధువులకు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. పెళ్లి చేసుకోవాలని యువకుడిని యువతి వేడుకున్నా.. యువకుడిది ఉన్నత కుటుంబం కావడంతో ఎట్టకేలకు యువతి ప్రేమకు వెలకట్టారు.